క్లుప్తంగా

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సన్మానం


కాలె యాదయ్యను సన్మానిస్తున్న తహసీల్దార్లు

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు నూతనంగా వచ్చిన తహసీల్దార్లు శుక్రవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మొయినాబాద్ తహసీల్దార్ గౌతం, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణ, శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్, షాబాద్ తహసీల్దార్ చిన్నప్పలనాయుడు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి బాగా పనిచేయాలని తహసీల్దార్లకు ఎమ్మెల్యే యాదయ్య సూచించారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ

కొత్తూరు: తాత్కాలిక సస్పెన్షన్‌కు గురైన కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తిరిగి బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో శరత్‌చంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సస్పెన్షన్‌కు గురికావడంతో వైస్ ఎంపీపీ శోభాను కలెక్టర్ ఇన్‌చార్జి ఎంపీపీగా నియమించారు. ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి సస్పెన్షన్ ముగియడంతో తిరిగి ఆయనను నియమించారు.

చదువుచెప్పిన గురువుకు అంతిమ నివాళులు


నివాళులర్పించిన పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

మణికొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడికి ఘన నివాళులర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి..రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మోర శ్రీశైలం నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిత్‌గా 11 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాడు. అతనికి ఒక కాలు లేక పోయినా విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మాభిమానం, పట్టుదల జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలనే ప్రేరేపణ చేసేవారు. ఆయన ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. అక్కడ శుక్రవారం తెల్లవారు జామున ఆసుపత్రిలోనే గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో అతని మృతదేహాన్ని పాఠశాలకు తీసుకొచ్చారు. అక్కడ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం అతని స్వగ్రామానికి పార్థివ దేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తరలించారు.

సమ్మె చేస్తున్నా స్పందించని సర్కార్

కొందుర్గు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు నెల రోజులుగా సమ్మె చేస్తున్నా సర్కార్ స్పందించడం లేదని సీఐటీయూ మండల కార్యదర్శి రాయికంటి గోపాల్ అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన వంటావార్పులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భరత్, మంజుల, రవి, రామచంద్రయ్య, భాగ్యమ్మ, సత్యమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు బాధాకరం

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి


పోలీసుల అదుపులో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

చేవెళ్ల: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌చేయాలని ఏఐటీయూసీ చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. రామస్వామి మాట్లాడారు. ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేసినంత మాత్రం ఉద్యమాలు ఆగిపోవన్నారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. అరెస్టయినవారిలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, సత్తిరెడ్డి, మక్బుల్, జె.అంజయ్య, డి. మల్లేశ్, కృష్ణగౌడ్ ఉన్నారు.

నందిగామ తహసీల్దార్‌గా జహీరుద్దీన్

నందిగామ: నందిగామ మండల తహసీల్దార్‌గా జహీరుద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రహ్మన్‌ఖాన్ నల్గొండ జిల్లా చింతపల్లికి బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేసిన జహీరుద్దీన్‌ను బదిలీలో భాగంగా నందిగామకు పంపించారు. కాగా రహ్మన్‌ఖాన్ నుంచి జహీరుద్దీన్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన విధులను సక్రమంగా నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.


కొందుర్గు: చేగిరెడ్డి ఘనాపూర్‌లో ఒరిగిన విద్యుత్ స్తంభం

మృత్యు పాశాలు!

- ఒరిగిన స్తంభాలు.. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో రైతులు, వినియోగదారులు

షాబాద్: విద్యుదాఘాతానికి అటు మూగజీవాలు, ఇటు మనుషులు మృతి చెందుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. గురువారం విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై 'సాక్షి' విజిట్ చేసింది. షాబాద్ మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో రైతుల పొలాల వద్ద విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో కర్రల్ని పాతి స్తంభాలుగా ఏర్పాటు చేస్తున్నారు. షాబాద్, బోనగిరిపల్లి, తాళ్లపల్లి, నాగర్‌గూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్, బొబ్బిలిగ్రామ, కొమరబండ తదితర గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు, ఫ్యూజ్ బాక్స్‌లు లేవు. విద్యుత్ వైర్లు అమాంతం తల వరకూ వ్రేలాడుతున్నాయి. వానాకాలం వచ్చిందంటే చాలు ఎక్కడో ఓ చోట విద్యుత్ ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. పశువులు, మనుషులు మృత్యువాత పడుతున్నా విద్యుత్ అధికారులు తమకేమి సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతాల్లో సరిపడా సిబ్బంది లేక రైతులే ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజులు వేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై ఎక్కి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వ్రేలాడుతున్న విద్యుత్ వైర్లను రైతులే సరిచేసుకుంటున్నారు. ఈ విషయంలో రైతులకు అవగాహన లేకపోవడంతో అవి మృత్యుపాశాలుగా మారి వారి ప్రాణాలను బలిగొంటుంది.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఎప్పుడు ఏం జరుగుతుందో బిక్కుబిక్కుమని ఉండాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. రోడ్ల ప్రక్కన, ఇళ్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె వేయకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగి పశువులు, మనుషులు మృత్యువాత పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగిరెడ్డిగూడ, చిలుకూరు, పెద్దమంగళారం, చిన్నమంగళారం, రెడ్డిపల్లి, సురంగల్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విద్యుదాఘాతానికి గురై ఆవులు, గేదెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయి. ఎత్‌బార్‌పల్లి, నాగిరెడ్డిగూడ, సజ్జన్‌పల్లి తదితర గ్రామాల్లో మనుషులు సైతం కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుదాఘాతానికి గురై చనిపోతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇనుప స్తంభాలు ఒరిగాయి. విద్యుత్ వైర్లు వ్రేలాడుతూ ప్రమాదకరంగా తయారయ్యాయి. వెంటనే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


షాబాద్: రైతులు ఏర్పాటు చేసుకున్న కర్ర స్తంభం

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మునిసిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద కరంగా మారాయి. ఆదర్శ పాఠశాల పరిసరాల్లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాద కరంగా తయారైంది. అయ్యప్పరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు వస్తున్నాయని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: బాకారం, అజీజ్‌నగర్, ఎన్కెపల్లి, చిన్నమంగళారం, అమ్డాపూర్, అప్పారెడ్డిగూడ, కేతిరెడ్డిపల్లి, ముర్తుజాగూడ హిమాయత్‌నగర్ ఆయా గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డు పక్కనే ఉండడంతో వర్షాలకు తడిసి కరెంటు షాక్ వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. చిలుకూరు బాలాజీకి వెళ్లే దారిలో హిమాయత్‌నగర్ వద్ద ఎలాంటి కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా తయారైంది. దీంతో వాహనాదారులు, పాదచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో రాత్రి వేళల్లో మంటలు వస్తున్నాయని స్థానికుడు షాబాద్ గిరి తెలిపాడు. బాకారంలో రోడ్డు మధ్యలోనే ఇనుప స్తంభం, అజీజ్‌నగర్‌లోని గాంధీ చౌరస్తా వద్ద కరెంటు తీగలు వ్రేలాడుతూ ప్రమాదకరంగా మారాయి.


మొయినాబాద్: విజయనగర్ కాలనీలో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


శంకర్‌పల్లి: ఆదర్శ పాఠశాల వద్ద ప్రమాద కరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


మొయినాబాద్‌రూరల్: బాలాజీ దేవాలయానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

కేశంపేట: కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ అధ్వర్యంలో యువజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు నేరవేర్చ లేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ చేసిన ఉద్యమ ఫలితంగానే రుణమాఫీని కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు.

జీపీ కార్మికులకు సంఘీభావం..

29 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం సబ్బండ వర్గాలను మోసం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

కోర్టు తీర్పుతో సంబురాలు...

రాహుల్‌గాంధీ పైన బీజేపీ వేసిన పరువునష్టం కేసులో ట్రయల్ కోర్టు రెండేళ్ల జైలు శిక్షను విధించిందని, ఇదే విషయమై కాంగ్రెస్ సుప్రీం కోర్టును ఆశ్రయించగా కేసుపై స్టే విధించిందని ఆయన అన్నారు. దీంతో రాహుల్‌గాంధీపై లోక్‌సభ విధించిన అనర్హత వేటు తొలిగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడు వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, పురుషోత్తంరెడ్డి, చౌలపల్లి ఎంపీటీసీ రాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యయాదవ్, భాస్కర్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

సమస్యలు పట్టని బీఆర్‌ఎస్ సర్కార్..

షాద్‌నగర్‌రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్‌ఎస్ సర్కార్ పట్టించుకోవడంలేదని టీపీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లిశంకర్ ఆరోపించారు. శుక్రవారం 22వ వార్డులోని భగత్‌సింగ్ కాలనీ, అంజయ్యకాలనీలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులను చేపట్టలేదని ఆరోపించారు. ఏ ఇంటికెళ్లినా ప్రజలు తమ కష్టాలను చెప్పుకుంటున్నారన్నారు. కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయని, కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాబర్‌అలీఖాన్, తిరుపతిరెడ్డి, అందెమోహన్, ఖదీర్, నవీన్, అర్జున్ లక్ష్మణ్, శ్రీనునాయక్, కొమ్ముక్రిష్ణ, అంజియాదవ్, పురుషోత్తంరెడ్డి, రాయికల్‌శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట


చేవెళ్లలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

చేవెళ్ల: దేశంలో కాంగ్రెస్ పార్టీని అణిచివేయాలని కక్ష సాధింపు చర్యలు చేపడుతున్న బీజేపీకి సుప్రీం కోర్టు ఇచ్చిన మధ్యాంతర ఉత్తర్వులు చెంపపెట్టు లాంటిదని నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, సమన్వయ సమితి అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డి. వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీపై సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధిచడంపై సుప్రీంకోర్టు స్టే విధిస్తూ మధ్యాంతర ఉత్తర్వులు జారీ చేయడంతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ బి. శైలజ, ఎంపీటీసీ గుండాల రాములు, మండలపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జె. శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా నాయకులు మధుసూదన్‌గుప్తా, పెంటయ్యగౌడ్, ఆగిరెడ్డి, పడాల రాములు, మల్లేశ్, మధుసూదన్‌రెడ్డి, పాటి దామోదర్‌రెడ్డి, గంగి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న నవీన్ రెడ్డి

నందిగామ: శ్రీరామచంద్ర స్వామీ దేవాలయ నిర్మాణానికి మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగర కుంట నవీన్ రెడ్డి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. కొత్తూరు మండలం తీగాపూర్‌లో నిర్మించనున్న శ్రీరామచంద్ర స్వామి దేవాలయ నిర్మాణానికి ఆయన నివాసంలో రూ. 5.11లక్షలను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తీగాపూర్ సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సాయిలు, బాలయ్య, రమేశ్ పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన సీఎం కేసీఆర్

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌రాథోడ్

షాద్‌నగర్‌రూరల్: సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గణేష్‌రాథోడ్ అన్నారు. కంసాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం యువజన కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదల కష్టాలను పట్టించుకోవడంలేదన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పేదల ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులయ్యారని గుర్తు చేశారు.


ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

ఈ కార్యక్రమంలో రమేష్‌నాయక్, గిరిధర్, అజ్మిత్ బాబ, మునావర్, వాహెబ్, మల్లయ్య, యాదగిరి, అంజద్, సత్తయ్య, సురేష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి


షాబాద్: టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకా వేయించాలని రేగడిదోస్వాడ, షాబాద్ డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి పేర్కొన్నారు. కక్కులూర్, తిర్మలాపూర్, కుమ్మరిగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి ఆవులు, గేదెలు అనారోగ్యానికి గురికాకుండా ఏడాదిలో రెండు విడతలు టీకాలు వేయించాలన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. చిలుకూరు, పెద్దమంగళారంలో గాలింకుటు మందులు వేశారు. వీఎల్‌ఓ పద్మ, ఎల్‌ఎస్‌ఏ కుమార్ వీఏలు శివకుమార్, భీమ్, ఖలీల్, రవి తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నదీమ్ నగర్‌లో పశువైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్య అధికారి దేవిరెడ్డి పశువులకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. వైద్య సిబ్బంది పద్మ, కుమార్, శివకుమార్, రవి పాల్గొన్నారు.


మొయినాబాద్: చిలుకూరులో నట్టల మందు వేస్తున్న పశువైద్యాధికారి దేవిరెడ్డి

విద్యాశాఖలో విలీనం చేయాలి

షాబాద్: సమగ్ర శిక్షా, కేజీబీవీ, యుఆర్‌ఎస్‌లను విద్యాశాఖలో విలీనం చేయాలని మండల అధ్యక్షుడు బర్క సతీశ్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా, కేజీబీవీ, యుఆర్‌ఎస్‌లను విద్యాశాఖలో విలీనం చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరికి టైమ్ స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

స్వయం ఉపాధే..జీవనోపాధి

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: యువత స్వయం ఉపాధిని జీవనోపాధిగా మలుచుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో వడ్ల చంద్రశేఖర్ ఏర్పాటు చేసుకున్న ఉడిపి హోటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదని కుంగి పోకుండా యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ర్యాకల శేఖర్, ఎండీ ఖాజామీయాపటేల్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నందిగామ: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని ధన్‌సింగ్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. నందిగామ ఏఎస్‌ఐ వెంకటేశ్వర స్వామి తెలిపిన వివరాల ప్రకారం..ధన్‌సింగ్ తండాకు చెందిన మెగావత్ మంజుల(16) బుధవారం సాయంత్రం ఇంట్లోనుంచి బయటకు వెళ్లింది. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమెకోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేదు. మంజుల తల్లి నీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొందుర్గు: మండలంలోని గంగన్నగూడాలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామంలో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు శుక్రవారం కొందుర్గు పోలీసులు గ్రామం వెలుపల ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి రూ. 22,310లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముర్రుపాలు బిడ్డకు శ్రేష్ఠం


మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్ గిరిజ, సర్పంచ్

షాబాద్: పుట్టిన బిడ్డకు ముర్రుపాలే శ్రేష్టమని అవి రోగనిరోధక శక్తినిస్తాయని మన్‌మర్రి సర్పంచ్ సుహాసిని, అంగన్‌వాడీ టీచర్ గిరిజ పేర్కొన్నారు. గురువారం మన్‌మర్రి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సావాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లులందరూ బిడ్డలకు పాలు పట్టించాలన్నారు. దీంతో పిల్లలకు రోగనిరోధక శక్తి పెరిగి రోగాల బారిన పడకుండా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పదార్థాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ, పరమేశ్వర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.


కొందుర్గు: చౌదరిగూడలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేష్‌బాబు

కొందుర్గులో..

కొందుర్గు: తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందని ఎంపీడీఓ మహేష్‌బాబు సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చౌదరిగూడ అంగన్‌వాడీలో నిర్వహించిన కార్యక్రమంలో మహేష్‌బాబు హాజరై తల్లిపాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జయలక్ష్మి, రేవతి, సర్పంచ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎక్సైజ్ సీఐ రాకేశ్

చేవెళ్ల: 2023–25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన మద్యం పాలసీలో చేవెళ్ల డివిజన్‌లో 26 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేవెళ్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రాకేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చేవెళ్ల డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు మొత్తం 26 మద్యం దుకాణాలకు అనుమతి ఉందన్నారు. చేవెళ్ల మండలంలో 6, శంకర్‌పల్లిలో 9, మొయినాబాద్‌లో 6, షాబాద్‌లో 5 మద్యం షాపులు కేటాయించారన్నారు. వాటిని ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్ల ప్రకారం అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. శక్రవారం నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఇతర వివరాలకు చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి



ఆమనగల్లు: రైతుబీమా పథకం కోసం కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు ఈ నెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏఈఓలు రాణి, మీనాక్షి, శివతేజ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల ట్రస్టు చేయూత

తలకొండపల్లి: పేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ చేయూత నందిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన పెంటయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్య, సుల్తాన్, నిరంజన్ నూతన ఇండ్ల నిర్మాణాలకు శుక్రవారం ట్రస్ట్ తరపున ఇసుక, స్టీల్, సిమెంట్, కంకర, తదితర ఇంటి మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో బాల కిష్టయ్యగౌడ్, రాములు, మల్లయ్య, లింగయ్య, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణానికి మెటీరియల్ అందజేసిన ట్రస్టు సభ్యులు